క్లుప్తంగా

భవానీ.. కరుణించు దేవీ



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా 15రోజులుగా భవానీ మందిరంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు పౌర్ణమి సందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఆర్‌ఎస్.శ్రీనివాస్, శివకుమార్, సంతోష్ తదితరులు ఉన్నారు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట (మెదక్): ప్రతీ వాహనదారుడు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ శంకర్ పిలుపునిచ్చారు. పెద్ద శంకరంపేటలో గురువారం కేఎన్ఆర్ ప్రాజెక్ట్ క్యూబ్ హైవేస్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రయాణం చేసేవారు తప్పకుండా హెల్మెట్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపవొద్దని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ మొయినొద్దీన్, ఏఎస్ఐ సునీత తదితరులు ఉన్నారు.

జీవిత బీమా.. కుటుంబానికి ధీమా



చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఓ వ్యక్తి జీవిత బీమా చేయించుకుంటే ఆ వ్యక్తి మరణానంతరం అతని కుటుంబ సభ్యులకు అది అండగా ఉంటుందని రీజినల్ మేనేజర్ ఉదయ్‌కిరణ్ అన్నారు. మండలంలోని చిట్కుల్ శాఖ ఏపీజీవీబీ ఖాతాదారుడైన కూకుట్లపల్లికి చెందిన చింతల లక్ష్మయ్య గత సంవత్సరం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అతడికి మంజూరైన రూ.20లక్షల బీమా చెక్కుకు భార్య భూమవ్వకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ జీవితబీమా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ చంపాలాల్, సిబ్బంది రజాక్‌పాషా, సంగమేశ్వర్, సిరిల్ తదితరులు పాల్గొన్నారు.

1.76 లక్షల మొక్కలు పెంచాలి : ఎంపీడీఓ



మాట్లాడుతున్న శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): వచ్చే ఏడాది వనమహోత్సవానికి 1.76 లక్షల మొక్కలు పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో వన నర్సరీల్లో లక్ష్యం మేరకు మొక్కలు నాటి రక్షించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని, రక్షిత మంచి నీటి పథకం లీకేజీలు లేకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్లు, ఏపీఓ పుణ్యదాస్, తదితరులు పాల్గొన్నారు.

తపస్ మహిళా కార్యదర్శిగా విజయ



తుప్రాన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) మెదక్ జిల్లా మహిళా కార్యదర్శిగా మండలంలోని ఉపాధ్యాయురాలు కె.విజయ నియామకం అయినట్లు తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ జిల్లాలో తపస్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అలాగే విద్యారంగానికి అవసరమైన సేవలు అందిస్తానని తెలిపారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోండి

● కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా హవేళిఘణాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి అర్హత కలిగిన జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హులు ఫారం 18 దరఖాస్తుకు సంబంధిత సర్టిఫికెట్లను జత చేస్తూ తహసీల్దార్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. సంబంధిత వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా నవంబర్ 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు నవంబర్ 23న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ప్రచురించాలని, డిసెంబర్ 9 లోపు అభ్యంతరాలను స్వీకరించి డిసెంబర్ 25 లోపు పరిష్కరించాలన్నారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితా ప్రచురించాల్సి ఉంటుందన్నారు. ఓటరు నమోదు ఫారాలు ఉచితంగా అందచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింధురేణుక, తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కును నమోదు చేసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హుస్సేన్

మెదక్ కలెక్టరేట్: తూనికలు, కొలతలు, చట్టాలపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ సూచించారు. గురువారం భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. చట్టాలపై వినియోగదారులు సమగ్రమైన అవగాహన కలిగి ఉండటం ఎంతగానో అవసరం అన్నారు. అవగాహన కలిగి ఉండడం ద్వారా విద్యార్థులు సమాజానికి సేవ చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తారని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా తూనికలు కొలతలు శాఖ అధికారి సుధాకర్ వివిధ పరికరాలను ప్రదర్శించి అవి ఎలా పనిచేస్తాయో వివరించారు. వినియోగదారుడిగా తమ హక్కులను ఎలా రక్షించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ శరత్‌రెడ్డి, భౌతికశాస్త్ర అధ్యాపకురాలు సుధారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

● సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధులు

చిన్నశంకరంపేట(మెదక్): సంపూర్ణ గ్రామీణ అభివృద్ధికి తమ వంతు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధి ఎస్‌పీ సింగ్ తెలిపారు. గురువారం నగర శివారులోని కొంపల్లిలో మినర్వగ్రాండ్‌లో గ్రామీణ సంపూర్ణ అభివృద్ధి ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. చిన్నశంకరంపేట, నార్సింగి, చేగుంట మండలాల్లోని 15 గ్రామాలలో రైతులకు వ్యవసాయం, విద్య, పశువైద్యం, ఆరోగ్య, నీటి యాజమాన్య పద్ధతులపై నిపుణులతో శిక్షణ అందించనున్నారు. సోలార్‌లైట్లు, పంపు సెట్లు, విద్య రంగంలో డిజిటల్ సేవలను అందించేందుకు గ్రామాలలో అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ జోనల్ ఆఫీసర్ విశాల్ భాటియా, డీఈఓ రాధాకిషన్, ఏడీఏ రాజ్‌నారాయణ, చిన్నశంకరంపేట వెటర్నరీ డాక్టర్ గీతా మాలిక, మండలంలోని మాజీ సర్పంచ్‌లు చిలుక నాగరాజు, ప్రభాకర్, పవన్‌గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.



ప్రాజెక్ట్ ప్రారంభోత్సవంలో ప్రతినిధులు, అధికారులు

బీజేపీ సభ్యత్వ నమోదును వేగిరం చేయండి

చిన్నశంకరంపేట(మెదక్): బీజేపీ సభ్యత్వాన్ని వేగవంతం చేయాలని మెదక్ నియోజవర్గ పార్టీ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్ కోరారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా జరిగిన క్రియాశీల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వంతో పాటు ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బీజేపీ కార్యకర్తలు దృష్టిసారించాలన్నారు. మెదక్ నియోజవర్గంలో ఇప్పటికే 60 వేల సభ్యత్వం దాటిందన్నారు. స్థానిక ఎన్నికలను ఎదుర్కొనేందుకు సభ్యత్వ నమోదు ప్రక్రియ కీలకం కానుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోగుల రాజు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ్ కుమార్

డీఏలను విడుదల చేయడం ప్రభుత్వ బాధ్యత



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న నాయకులు

టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్

దుబ్బాకటౌన్: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను విడుదల చేయడం ప్రభుత్వ బాధ్యత అని వాటిని వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ డిమాండ్ చేశారు. రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు గత ప్రభుత్వం ఇస్తానన్న 5వేల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పోస్టులను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. అలాగే దుబ్బాకలో సీనియర్ నాయకుడు తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి, కనకయ్య, రాములు, నర్సింహులు గౌడ్, హరీశ్, కరుణాకర్, మెట్టురామ్, వరప్రసాద్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరాధన మహోత్సవం



హోమం నిర్వహిస్తున్న రాజయోగాశ్రమ భక్తులు

చిన్నశంకరంపేట(మెదక్): బోధానంద సద్గురు యోగీశ్వర భూమినాథం మహారాజ్ ఆరాధన మహోత్సవం వైభవంగా జరిగింది. గురువారం మండల కేంద్రంలోని పద్మనాభ స్వామి గుట్టపై ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా భూమినాథ్ మహారాజ్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం వేదపండితుడు సంగమేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో కామదేనువు హోమం చేపట్టారు.ఆరాధనోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మర్కూక్(గజ్వేల్): అక్రమంగా తరలిస్తున్న 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని చేబర్తి గ్రామంలో గురువారం పట్టుకున్నామని ఎస్ఐ దామోదర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన మాలోతు ప్రవీణ్ తన ఆటోలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడిచేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యానిధి దరఖాస్తుల గడువు పెంపు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2024–25 విద్యా సంవత్సరానికి గాను అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం దరఖాస్తుల గడువును 29వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ అధికారి కవిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అలయ్ బలయ్ విజయవంతం చేయండి

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లిలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బెజ్జంకిలో గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి హరీశ్ రావు పాల్గొంటారని చెప్పారు. లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్‌గుప్త, శ్రీనివాస్‌రావు, రాజయ్య, రమేశ్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని నార్సింగి తహసీల్దార్ కరీం, ఎంపీడీఓ ఆనంద్ సూచించారు. నార్సింగి మండల కేంద్రంతో పాటు నర్సంపల్లి, నర్సంపల్లి పెద్దతండాలో ఐకేపీ ఆధ్వర్యంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఓ అశోక్, సీసీలు శంకర్, సుల్తానా, కార్యదర్శులు పాల్గొన్నారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు

రేగోడ్(మెదక్): ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్ రైతులను కోరారు. మండల కేంద్రమైన రేగోడ్‌లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేశ్, ఎంపీడీఓ సీతారావమ్మ, ఐకేపీ ఏపీఎం సంగీత, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాధా కిషన్, పంచాయతీ కార్యదర్శి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని రాంపూర్‌లో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో వరికొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో తహసీల్దార్ మల్లయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ శంకర్, ఏపీఎం నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేషారెడ్డి తదితరులున్నారు.

'గాలికుంటు'కు టీకాలు తప్పనిసరి

చిలప్‌చెడ్(నర్సాపూర్): పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వేసే నివారణ టీకాల వల్ల వాటిలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటాయని వెటర్నరీ అసిస్టెంట్ ఇబ్రహీం అన్నారు. గురువారం ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని సోమక్కపేట్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి పశువుకు టీకా ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శంకర్, అరవింద్, గ్రామస్తులు పాల్గొన్నారు.



గేదెకు టీకా వేస్తున్న సిబ్బంది

సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌రెడ్డి



సుధాకర్‌రెడ్డి

టేక్మాల్(మెదక్): తనను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కరీంనగర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మామిడి సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. 317 జీఓ సమస్య పరిష్కారంతో పాటు మన్‌సర్వీస్ రూల్స్ సాధనకు ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. కేజీబీవీ, మోడల్‌స్కూల్, గురుకులాల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పని చేస్తానన్నారు. గతంలో పోటీ చేస్తే మూడో స్థానంలో అవకాశం కల్పించారని తెలిపారు.

ఆదర్శ సొసైటీగా తీర్చిదిద్దుతాం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రమేష్

● లాభాల్లో రైతులకు 10 శాతం వాటా
● కొత్తపల్లి రైతుసేవా సహకార సంఘం చైర్మన్ రమేష్

పాపన్నపేట(మెదక్): కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం లాభాల్లో రైతులకు 10 శాతం వాటా ఇస్తామని పాలకవర్గ చైర్మన్ త్యార్ల రమేష్ ప్రకటించారు. గురువారం కొత్తపల్లిలో జరిగిన సొసైటీ మహాజన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే ఆదర్శ సొసైటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. 2023–24 సంవత్సరానికి గాను సొసైటీకి రూ. 2,47,54,000 నికర లాభం, రూ.75.81 లక్షల వ్యాపార లాభం వచ్చినట్లు చెప్పారు. రుణమాఫీ కింద 1,017 మంది రైతులకు రూ. 6,35,63,067 రాగా, వాటిని తిరిగి రైతులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. మరణించిన సభ్య రైతులకు రూ. 5 వేలు చెల్లించినట్లు తెలిపారు. బీపీసీఎల్ కంపెనీ నిబంధనల మేరకు పెట్రోల్ బంక్‌ను కన్స్యూమర్ లైసెన్స్ నుంచి రిటేల్ ఔట్‌లెట్ లైసెన్స్‌గా మార్చినట్లు చెప్పారు. సీఎన్‌జీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. సొసైటీ ఆవరణలో 2,300 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. సభ్యులు మల్లప్ప, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గోపాల్, నర్సింలు, యాదగిరి మాట్లాడుతూ.. అసైన్డ్ భూముల్లో తీసుకున్న రుణాలకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్, ఫీల్డ్ ఆఫీసర్ యాదగిరి, సీఈఓ వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు కేంద్ర పథకాలు చేర్చండి

సిద్దిపేటరూరల్/హుస్నాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అన్ని సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరేలా కార్యకర్తలు చొరవ చూపాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రాఘవాపూర్‌లో గురువారం ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని స్థాయిల నాయకులు సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొని 100మందిని సభ్యులుగా చేర్పాలని కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 20మంది బీజేపీలో చేరినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సురేశ్ గౌడ్, తిరుమలరెడ్డి, రమేశ్‌గౌడ్, నవీన్, త్రిలోచన్ రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్ బాబు పాల్గొని హమాలీ కార్మికులకు సభ్యత్వాలు నమోదు చేయించారు.



సిద్దిపేటరూరల్: మాట్లాడుతున్న మోహన్ రెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ **బగలాముఖీ ఆలయంలో విశిష్ట పూజలు**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో గురువారం పౌర్ణమి సందర్భంగా విశిష్ట పూజా కార్యక్రమాలు చేపట్టారు. వేద పండితుడు, బగలాముఖీ ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు హరిద్వార్చన, విశేష పూజలు, హోమం చేపట్టారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

◆ **గ్రామాలను సందర్శించాలి**

చిలప్‌చెడ్(నర్సాపూర్): పంచాయతీ కార్యదర్శులు ప్రతీ నిత్యం గ్రామాలను సందర్శించి, మౌలిక సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నర్సరీ పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. శీతాకాలం ప్రారంభమైనందున పంచాయతీ కార్మికులకు రేడియం జాకెట్లు, షూస్ తదితర వసతులు కల్పించాలన్నారు.

◆ **43 మంది ఉపాధ్యాయులు రాక**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలానికి 43 మంది ఉపాధ్యాయులు వచ్చినట్లు ఎంఈఓ బాలరాజు గురువారం తెలిపారు. ఇటీవలే బదిలీఅయినా రిలీవర్ లేక విధుల్లో కొనసాగిన ఉపాధ్యాయులు ప్రస్తుతం రిలీవ్ అయినట్లు పేర్కొన్నారు. 22 మంది ఇతర మండలాలకు వెళ్లారని తెలిపారు.

◆ **రికార్డుల తనిఖీ**

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయాన్ని మెదక్ ఆర్డీఓ రమాదేవి గురువారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధరణి పెండింగ్ ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తూ, నిర్ణీత వ్యవధిలో భూసేకరణ మధ్యవర్తిత్వ కేసుల తనిఖీ జాబితా తయారు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని రకాల సర్టిఫికెట్లు నిర్ణీత వ్యవధిలో క్లియర్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ మల్లయ్య తదితరులు ఉన్నారు.

◆ **దీపాదాస్ మున్షీని కలిసిన చంద్రశేఖర్**

జహీరాబాద్ టౌన్: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కాంగ్రెస్ జహీరాబాద్ నియోజకర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి చంద్రశేఖర్ గురువారం హైదరాబాద్‌లో కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ఎస్సీ వర్గీకరణ చేయాలని ఈ సందర్భంగా ఆమెకు విజ్ఞప్తి చేశారు. సంస్థాగత ఎన్నికల్లో మాదిగలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం నియమించే కార్పొరేషన్ పదవులను కేటాయించాలని కోరారు. ఆయన వెంట సతీశ్ మాదిగ, గజ్జెల కాంతం ఉన్నారు.

◆ **క్రికెట్ పోటీలో విజేత శాలిపేట**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని శాలిపేటకు చెందిన ఉప్పరి గణేశ్ స్మారక క్రికెట్ పోటీలలో శాలిపేట విజేతగా నిలిచింది. చిట్కోజిపల్లి రన్నర్‌గా నిలిచింది. శాలిపేటలో వారం రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. విజేతలకు మాజీ సర్పంచ్ పోచయ్య బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ **తాగునీటి సమస్య పరిష్కరించండి**

మనోహరాబాద్(తూప్రాన్): కోనాయపల్లిలోని పలు కాలనీలలో మిషన్ భగీరథ తాగునీరు రావడం లేదని గ్రామస్తులు గురువారం నిరసన తెలిపారు. తమ కాలనీలలో పదిహేను రోజులుగా తాగునీరు రావడం లేదని పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. తాగునీటికి వేరే ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

◆ **బిందు సేద్యంపై అవగాహన**

చేగుంట(తూప్రాన్): మండలంలోని మహిళ రైతులకు గురువారం చేగుంటలో బిందు సేద్యంపై సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నెటాఫీమ్ ఇరిగేషన్ సంస్థ ప్రతినిధి సుబ్బారావు మాట్లాడుతూ.. బిందు సేద్యంతో 30 శాతం నీటిని ఆదా చేయవచ్చునని తెలిపారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి కేజీబీవీ బాలికల పాఠశాలలో స్కావెంజర్ పోస్టు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి పూర్తి చేసిన మహిళలు సోమవారం వరకు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ **ఇందిరమ్మ కమిటీలు వేయాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లో సభలు నిర్వహించి ఇందిరమ్మ గ్రామ కమిటీలు వేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీలు కాంగ్రెస్ నాయకుల సూచనల మేరకు అధికారులు వేయడం సరికాదన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామసభలను నిర్వహించి వేయాలన్నారు. కేవలం కాంగ్రెస్ నాయకులతో వేస్తే అవకతవకలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకు ఏకపక్షంగా చేసిన కమిటీలను రద్దుచేసి కొత్త కమిటీలు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, బీజేపీ మండలం అధ్యక్షుడు రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.